రసవత్తర రాజకీయం

# కాంగ్రెస్‌కు బీటలు



**గ్రేటర్‌లో** అంతంత మాత్రంగానే ఉన్న కాంగ్రెస్ పార్టీ బీటలు వారుతున్నది. అనేక నియోజకవర్గాల్లో సరైన అభ్యర్థులే కనిపించకపోగా.. ఉన్న కొద్దిపాటి స్థానాల్లోనూ ప్యారాచూట్ నేతలు హస్తం కొంప ముంచుతున్నారు. ఇందులో భాగంగా మల్కాజిగిరి నియోజకవర్గం కాంగ్రెస్‌లోకి ప్యారాచూట్ నేత మైనంపల్లి హన్మంతరావు కాలుమోపింది మొదలు.. పార్టీలో ప్రకంపనలు మొదలయ్యాయి. ఏకంగా మేడ్చల్ డీసీసీ అధ్యక్షుడు నందికంటి శ్రీధర్ పార్టీకి రాజీనామా చేయగా.. మరికొన్ని గంటల్లో మూకుమ్మడి రాజీనామాలకు కీలక నేతలు సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని మరికొన్ని నియోజకవర్గాల్లోనూ ప్యారాచూట్ నేతల గండం పొంచి ఉండటంతో మున్ముందు గ్రేటర్ కాంగ్రెస్ పరిస్థితి మరింత దిగజారనున్నదని ఆ పార్టీ నేతలే ఆవేదన చెందుతున్నారు. ముఖ్యంగా ఐదు ఎకరాలు.. రూ.10 కోట్లతో మహేశ్వరం నియోజకవర్గం నుంచి మొదలైన 'సీటుకు నోటు' పరిణామాలన్నీ బలాన్ని చేకూరుస్తున్నాయనే వాదనలు వినిపిస్తున్నాయి.

- గ్రేటర్ కాంగ్రెస్ కొంప కొల్లేరు
- రాజీనామాతో కాంగ్రెస్‌కు భారీ షాక్ ఇచ్చిన మేడ్చల్ డీసీసీ అధ్యక్షుడు
- మరికొన్ని గంటల్లో మూకుమ్మడి రాజీనామాలకు కీలక నేతలు సిద్ధం
- గ్రేటర్‌లోని పలు నియోజకవర్గాల్లోనూ 'ప్యారాచూట్' గ్రహణం
- కాంగ్రెస్‌లో 'సీటుకు నోటు'ను మరింత బలపరుస్తున్న తాజా పరిణామాలు

సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, అక్టోబర్ 2 (నమస్తే తెలంగాణ) : అసెంబ్లీ ఎన్నికల టికెట్లు ఖరారు ప్రక్రియలోనే కాంగ్రెస్‌కు దిమ్మతిరిగే పరిణామాలు ఎదురవుతున్నాయి. పార్టీని నమ్ముకొన్న వారిని పక్కకు పెట్టి.. రాత్రికి రాత్రి కండువా కప్పుకున్న వారికి ఎర్ర తివాచీ పరిచి.. టికెట్లు ఇచ్చేందుకు సిద్ధమవుతుండటం హస్తం పార్టీ నేతలను కలవరపరుస్తున్నది. ఇందులో భాగంగా మల్కాజిగిరి నియోజకవర్గంలో మైనంపల్లి హన్మంతరావుకు కండువా కప్పక ముందే నియోజకవర్గం కాంగ్రెస్‌ను అసంతృప్తి కుదిపేసింది. డీసీసీ అధ్యక్షుడు, బీసీ నేత నందికంటి శ్రీధర్ సోమవారం ఆ పార్టీకి రాజీనామా చేయడం సంచలనం సృష్టించింది. వాస్తవానికి కాంగ్రెస్ 45మంది బీసీలకు టికెట్లు ఇవ్వాలంటూ డిమాండు చేస్తున్న కీలకమైన బీసీ నేతల్లో నందికంటి ఒకరు. అంతేకాకుండా హైకమాండ్‌కు ఇచ్చిన బీసీ నేతల జాబితాలో నందికంటి పేరు రెండో స్థానంలోనే ఉంది. అయినప్పటికీ టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌తో పాటు హైకమాండ్ బీసీ నేతను బలి చేసి.. మైనంపల్లికి టికెట్ హామీ ఇవ్వడం బీసీలపై కాంగ్రెస్ పార్టీకి ఎంత మమకారం ఉందో తేటతెల్లమైంది. ఈ నేపథ్యంలో నందికంటి బాటలోనే మల్కాజిగిరి నియోజకవర్గం కాంగ్రెస్ నేతలు, శ్రేణులు మూకుమ్మడి రాజీనామాలకు సిద్ధమవుతుండటంతో ఆ నియోజకవర్గంలో హస్తం పార్టీ ఇక కోలుకునే పరిస్థితిలో లేదని రాజకీయ పరిశీలకులు స్పష్టం చేస్తున్నారు. మైనంపల్లి వెంట వచ్చిన గుప్పెడు మందితో పాటు కాంగ్రెస్‌లో మిగిలే మరో గుప్పెడు మంది తప్ప ఆ పార్టీ ఉనికే ప్రశ్నార్థకంగా మారిందని చెబుతున్నారు.

## అంతటా.. 'సీటుకు నోటు' వ్యవహారమేనా..?

మల్కాజిగిరిలోనే కాదు.. గ్రేటర్ పరిధిలోని పలు నియోజకవర్గాల్లోనూ ప్యారాచూట్ నేతలు కాంగ్రెస్ పార్టీని పుట్టి ముంచడం ఖాయమని ఆ పార్టీ నేతలే చెబుతున్నారు.

- జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఆది నుంచి పార్టీలో ఉన్న విష్ణువర్ధన్‌రెడ్డిని కాదని.. అసలు ఏనాడూ క్షేత్రస్థాయిలో తిరగని మాజీ క్రికెటర్ అజారుద్దీన్ ప్యారాచూట్ వేసుకొని నియోజకవర్గంలో వాలిపోయారు. దీంతో విష్ణు వర్గం రగిలిపోతున్నది.
- ఎల్బీనగర్‌లో ఆది నుంచి పార్టీని నమ్ముకొని, టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్న వాళ్లు పలువురు నాయకులు ఉండగా.. మధుయాష్కీ ప్యారాచూట్ వేసుకొని దిగారు.
- మహేశ్వరం నియోజకవర్గం నుంచి రంగారెడ్డి డీసీసీతో పాటు పలువురు నాయకులు ఆది నుంచి కాంగ్రెస్‌ను నమ్ముకొని ఉన్నారు. కానీ ఇక్కడ కూడా కొంతకాలం కిందటే పార్టీలో చేరిన బడంగ్‌పేట మేయర్ చిగురింత పారిజాత, ఆమె భర్త నర్సింహారెడ్డికి టీపీసీసీ అధ్యక్షుడు ఒత్తాసు పలుకుతుండటం పార్టీ శ్రేణులు జీర్ణించుకోలేకపోతున్నాయి.
- మేడ్చల్‌లో కూడా చాలామంది నాయకులు టికెట్ ఆశిస్తుండగా.. ఇక్కడ కూడా మైనంపల్లి అనుచరుడు నక్క ప్రభాకర్ పేరు చక్కర్లు కొడుతుండటంతో పార్టీ శ్రేణులు తట్టాబుట్టా సర్దుకునేందుకు సిద్ధమయ్యాయి.

అయితే ప్యారాచూట్ నేతలు రావడం వెనక ప్రధానంగా 'సీటుకు నోటు' వ్యవహారం ఉందనే విమర్శలు వినిపిస్తున్నాయి. మహేశ్వరం ఎపిసోడ్ తర్వాత రాష్ట్రవ్యాప్తంగా అనేక నియోజకవర్గాల్లో కోట్లాది రూపాయలు వివిధ రూపాల్లో చేతులు మారి, టికెట్ల ఖరారుకు దారి తీస్తున్నాయనే ప్రచారం జోరందుకున్నది. ఈ క్రమంలో గ్రేటర్‌లోనూ ప్యారచూట్ నేతల రాక వెనక ఇదే మర్మం ఉన్నదనే అనుమానాలు పార్టీలో వ్యక్తమవుతున్నాయి.

## కాంగ్రెస్‌కు నందికంటి రాజీనామా

- కుటుంబానికి ఒక్కటే టికెట్ .. మైనంపల్లికి ఎందుకు రెండు.?
- మాపై కేసులు పెట్టి వేదించిన వారికి టికెట్ ఇవ్వడం సరికాదు
- కన్న తల్లి ఇలా చేస్తే.. ఎవరికి చెప్పుకోవాలి.?
- కాంగ్రెస్‌లో బీసీలకు మనుగడ లేదు
- మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు నందికంటి శ్రీధర్



మల్కాజిగిరి, అక్టోబర్ 2 : ''కష్టకాలంలోనూ నాతో కలిసి ముందుకు నడిచిన మల్కాజిగిరి నియోజకవర్గం ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నానని'' మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నందికంటి శ్రీధర్ అన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ 30 ఏండ్ల తన రాజకీయ జీవితంలో నేను ఎప్పుడూ కాంగ్రెస్ పార్టీలోనే ఉండాలని, చనిపోతే కాంగ్రెస్ జెండా కప్పుకొని చనిపోవాలన్న అకాంక్షతో బతికిన వ్యక్తినని ఈ రోజు బాధతో చెప్పాల్సిన పరిస్థితి వచ్చిందని అన్నారు. 2013లో కౌన్సిలర్‌గా, 2018లో కోఆప్షన్ సభ్యుడిగా ఉన్నప్పుడు కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇవ్వకున్నా పార్టీ ఆదేశాలని తూచా తప్పకుండా పనిచేసి ఆరోజు విజయానికి కృషి చేశానని తెలిపారు. కుటుంబానికి ఒక్కటే టికెట్ ఇస్తామని ఉదయపూర్ డిక్లరేషన్‌లో ఎంపీ రాహుల్‌గాంధీ చెప్పారు. నియోజకవర్గంలో ఎన్నో అరాచకాలు చేసి, మాపై ఎన్నో కేసులు పెట్టిన వ్యక్తికి కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇవ్వడం సరికాదన్నారు. ఇప్పటి వరకు బీసీలను కాంగ్రెస్ పార్టీ ఆదరిస్తుందనే నమ్మకంతో ఉండేవాడినని, ఈ రోజు నాకు టికెట్ ఇవ్వకుండా మాపై కేసులు పెట్టిన వారికి ఇవ్వడం బాధగా ఉన్నదని ఆవేదన వ్యక్తం చేశాడు. ఇన్ని రోజులు పార్టీకి సేవ చేసిన.. ఒక కన్న తల్లిగా కాంగ్రెస్ పార్టీని ప్రేమించిన.. కానీ కన్న తల్లే కాదనుకుంటే ఎవరికి చెప్పాలి..? ఎక్కడికి వెళ్లాలి..? ఇది ముందటి కాంగ్రెస్ పార్టీల కనిపిస్తలేదని అన్నారు. ఎన్నో ఇబ్బందులు పెట్టిన వ్యక్తిని తీసుకువచ్చి మెదక్, మల్కాజిగిరి టికెట్లు ఇస్తే.. పార్టీ మనుగడ ఏమవుతుందని ప్రశ్నించారు.

### కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేస్తున్నా

కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేస్తున్నానని, రాజీనామా లెటర్ ఢిల్లీలోని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడికి పంపిస్తున్నానని నందికంటి శ్రీధర్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో బీసీలకు మనుగడ ఉండదని తెలిపారు. నా కన్న తల్లే ఇలా చేస్తే నా పరిస్థితి ఏమిటి? మా కార్యకర్తల పరిస్థితి ఏమిటి. నాకు సహకరించిన నియోజక వర్గం ప్రజలకు కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

# బాపూజీ బాటలో నడుద్దాం..

గాంధీ జయంతి సందర్భంగా వక్తలు



### బాపూఘాట్‌లో జాతిపితకు ఘన నివాళి

మెహిదీపట్నం, అక్టోబర్ 2 : జాతిపిత మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకొని సోమవారం బాపూఘాట్‌లో గాంధీ సమాధిపై రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర్ రాజన్, రాష్ట్ర హోంమంత్రి మహమూద్ అలీ, విద్యాశాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి, ఎంపీ కె.కేశవరావు, నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, సీఎస్ శాంతికుమారి, డీజీపీ అంజనీకుమార్, కలెక్టర్ అనుదీప్, జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రోస్, పర్యాటక శాఖ కార్యదర్శి శైలజ రామయ్యర్, నగర గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గడ్డం శ్రీనివాస్ యాదవ్, కార్వాన్ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి ఠాకూర్ జీవన్‌సింగ్ తదితరులు పూలు వేసి నివాళులర్పించారు. అనంతరం ధ్యాన మందిరం ఎదుట ఉన్న గాంధీ విగ్రహం వద్ద పూలు వేశారు. ఇదిలా ఉండగా ధ్యాన మందిరంలో ఏర్పాటు చేసిన సర్వమత ప్రార్థనలలో గవర్నర్ తమిళిసై పాల్గొనకుండా బయట నుంచే వెళ్లిపోయారు.



తెలంగాణ భవన్‌లో మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి రూప్‌సింగ్



### జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో..

జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం కమిషనర్ రొనాల్డ్ రాస్, ఉన్నతాధికారులు జాతిపిత మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. చీఫ్ అడిషనల్ కమిషనర్ యాదగిరి రావు, శ్రీవాత్సవ, అకౌంట్ ఎగ్జామినర్ వెంకటేశ్వర్ రెడ్డి, ఎంటమాలజిస్ట్ రాంబాబు, సీపీఆర్వో మహమ్మద్ మూర్తుజ అలీ, తదితరులు పాల్గొన్నారు.



### వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో...

సికింద్రాబాద్, హరిహర కళాభవన్‌లోని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి హైదరాబాద్ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జె.వెంకటి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డా.అశ్రిత రెడ్డి, డా.ఖలీల్, డా.గిరిజా, వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, నిరంజన్, వై.గీతాలు, రాజ్యలక్ష్మి, డీపీఓ సంతోశ్, తదితరులు పాల్గొన్నారు.



### సికింద్రాబాద్ ఎంజీ రోడ్డులో..

బేగంపేట్ అక్టోబర్ 2 : సికింద్రాబాద్ ఎంజీ రోడ్డులోని గాంధీ విగ్రహానికి మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పూల మాల వేసి నివాళులర్పించారు. మంత్రితో పాటు త్రిపుర చీఫ్ జస్టిస్ అమర్నాథ్ గౌడ్, మాజీ కార్పొరేటర్ అరుణగౌడ్, బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం మక్తాల ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని మంత్రి ప్రారంభించారు.